సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
మంగళవారం | 31 | డిసెంబర్ | 2024





కొలువుల ఏడాది

ఈ సంవత్సరం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగువేల వరకు ఉద్యోగాలు

ఈ ఏడాది.. ఉద్యోగాల కాలంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 4వేల మంది సర్కారు కొలువులకు ఎంపికయ్యారు. వైద్య, పోలీస్, గ్రూప్–4 విభాగాలతోపాటు వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. పోలీసు శాఖలోనే ఎక్కువ నియామకాలు జరగడంతో ఖాకీ డ్రెస్ వేసుకుని మురిసిపోయారు.

- సాక్షి, వరంగల్

- వివరాలు 8లో

నయా జోష్



న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమైన నగరం

- నగరంలో పలు చోట్ల డిసెంబర్ 31 ఈవెంట్లకు అనుమతి
- అపార్ట్‌మెంట్లలో హవా..
- రిసార్ట్స్, హోటళ్లు అడ్వాన్స్ బుక్

కాజీపేట అర్బన్:

ప్రస్తుత సంవత్సరానికి బైబై చెబుతూ.. కొత్త సంవత్సరానికి వెల్‌కం చెప్పేందుకు వరంగల్ మహానగరం సిద్ధమైంది. గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్ల వాసులు ఉమ్మడి కుటుంబాలుగా కలిసి వేడుకలు నిర్వహిస్తుంటే.. రిసార్ట్స్, హోటళ్లలో డీజే పాటలు, డ్యాన్సులతో యువత ఉర్రూతలూగనుంది. నయా సాల్ రానున్న నేపథ్యంలో నగరంలో నయా జోష్ కనిపిస్తోంది.

సరదా పోటీలు.. బహుమతులు



డిసెంబర్ 31 రాత్రి మా అపార్ట్‌మెంట్‌లో సందడిగా ఉంటుంది. అన్ని కుటుంబాలు ఒక చోట చేరి వివిధ రకాల పోటీలను సరదాగా ఏర్పాటు చేసుకుంటాం. ప్రోత్సాహకంగా బహుమతులు అందజేస్తాం.

- గోలి రవీందర్, అధ్యక్షుడు, జీఎంఆర్ బృందావన్

కొత్తగా కనిపించాలని..

న్యూఇయర్ సందర్భంగా నూతన వస్త్రాలు ధరించేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో షాపింగ్ మాళ్లలో సందడి నెలకొంది. కొత్త సంవత్సరం ప్రారంభం రోజు కొత్త బట్టలు వేసుకుంటే అంతా మంచే జరుగుతుందనే భావనతో యువత షాపింగ్ మాళ్లవైపు పరుగులు పెడుతోంది.

వేడుకలకు వేదిక రిసార్ట్

ఇది వరకు భాగ్యనగరానికే పరిమితమైన రిసార్ట్స్ కల్చర్ ఇప్పుడు గ్రేటర్‌లోనూ విస్తరించింది. ప్రైవసీ, ప్రొటెక్షన్ నేపథ్యంలో రిసార్ట్‌లో వేడుకలు జరుపుకునేందుకు నగరవాసులు ఆసక్తి కనబరుస్తున్నారు. నగరం చుట్టుపక్కలా ఉన్న రిసార్టుల్లో న్యూఇయర్ వేడుకలు జరుపుకునేందుకు అప్పుడే బుకింగ్ చేసుకున్నారు. పలు హోటళ్లలో డిసెంబర్ 21, న్యూఇయర్ వేడుకలు జరుపుకునేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. డీజే, డ్యాన్స్, ఫుడ్, డ్రింక్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే పోలీస్‌శాఖనుంచి మూడు చోట్ల ఈవెంట్లకు అనుమతి కూడా తీసుకున్నారు. ఇందులో పాల్గొనేందుకు సింగిల్, కపుల్, ఫ్యామిలీ టికెట్లను విక్రయిస్తున్నారు.



జీఎంఆర్ బృందావన్ ప్రత్యేకం..

వడ్డేపల్లిలోని జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్లలో 272 ప్లాట్లలో 272 కుటుంబాలున్నాయి. ఇవి ఉమ్మడి కుటుంబాన్ని తలపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏటా న్యూ ఇయర్ వేడుకలను అపార్ట్‌మెంట్‌లోని లాన్‌లో డిసెంబర్ 31న ఘనంగా జరుపుకుంటారు. థర్టీ ఫస్ట్ నైట్ మ్యూజికల్ నైట్‌లో అందరూ ఆడిపాడుతూ సందడి చేస్తారు. రాత్రి 12 గంటల తర్వాత న్యూఇయర్ కేక్ కట్ చేసి గ్రీటింగ్స్ చెప్పుకుంటారు.

సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం: సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రజలకు సూచించారు. న్యూ ఇయర్ వేడుకలపై సోమవారం ఆయన పలు సూచనలతో ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 31న రాత్రి నిర్వహించుకునే నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో స్థానిక పోలీసులతోపాటు ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, క్రైమ్, షీ టీమ్స్‌తోపాటు పెట్రోలింగ్ సిబ్బంది ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్ధరాత్రి 12.30 గంటల్లోపు ముగించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఎవరైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఎలాంటి అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, సీసీ కెమెరాలతోపాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. మత్తు పదార్థాలు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తామని, ఎవరైనా చిక్కితే జరిమానాతోపాటు జైలుశిక్ష ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులకు గురిచేసేలా బహిరంగ ప్రదేశాల్లో వేడుకలను నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. పై ఆంక్షలను ఎవరైనా అతిక్రమించినట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కొలువుదీరిన కొత్త ఉద్యోగులు



హన్మకొండఅర్బన్: ఇటీవల జిల్లాలో గ్రూప్–4 ద్వారా ఎంపికైన ఉద్యోగుల్లో 11 మంది రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు పొందిన విషయం తెలిసిందే. కాగా.. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వారికి ప్రజల నుంచి స్వీకరించిన వినతులు ఆన్‌లైన్ చేసి రశీదులు అందజేసే బాధ్యతలను అధికారులు అప్పగించారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా పని చేస్తున్న నర్సింహారావును సీసీఆర్‌బీకి, ఐటీ కోర్ ఎస్సైగా పని చేస్తున్న పి.రాజ్‌కుమార్‌ను మడికొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

'కలెక్టరేట్‌లో వేడుకల్లేవ్'

హన్మకొండ అర్బన్: నూతన సంవత్సరం–25 సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్‌లో ఎలాంటి వేడుకలు, ఉత్సవాలు నిర్వహించడం లేదని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో సంతాప దినాలు ప్రకటించినందున వేడుకలు, ఉత్సవాలు నిర్వహించడం లేదని పేర్కొన్నారు. మర్యాద పూర్వకంగా తనను కలిసే అధికారులు, సంఘాల నాయకులు, ఎన్జీఓలు ఉదయం 10.30 గంటలకు క్యాంపు కార్యాలయానికి రావాలని సూచించారు.

రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించాలి: డీవైఎస్‌ఓ



వరంగల్ స్పోర్ట్స్: సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలని హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోతు అశోక్‌కుమార్ అన్నారు. నేటి(మంగళవారం) నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైన బాక్సర్లు సోమవారం బయల్దేరి వెళ్లారు. క్రీడాకారులకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ట్రాక్‌సూట్లను అందజేశారు. ఈసందర్భంగా డీవైఎస్‌ఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో భూపాలపల్లి డీవైఎస్‌ఓ సీహెచ్ రఘు, పీడీ పార్థసారథి, ఎన్ఐఎస్ డిప్లొమా ఎస్.నరేంద్రదేవ్, బాక్సింగ్ కోచ్ శ్యామ్‌సన్, జయపాల్ పాల్గొన్నారు.

డీఈఈసెట్‌కు వెబ్ ఆప్షన్ల అవకాశం

విద్యారణ్యపురి: డిప్లొమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో అర్హత సాధించిన అభ్యర్థులు, ఇదివరకు మొదటి, రెండో, మూడో దశలో వెబ్ ఆప్షన్లు ఇవ్వని అభ్యర్థులకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించినట్లు హనుమకొండ ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ ఎండీ అబ్దుల్‌హై సోమవారం తెలిపారు. జనవరి 2 నుంచి 4 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలన్నారు. రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపదికన జనవరి 9న సీట్లు కేటాయిస్తారని పేర్కొన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు జనవరి 9 నుంచి 13 వరకు ఫీజు చెల్లించి ఫైనల్ అడ్మిషన్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జనవరి 16న తమకు సీటు వచ్చిన డైట్ కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఉపాధ్యాయ ఓటర్లు 24,905

వరంగల్ -ఖమ్మం- నల్లగొండ నియోజకవర్గ తుది ఓటర్ల జాబితా వెల్లడి

- మూడు నెలల ప్రక్రియకు తెర
- 12 జిల్లాలు, 200 పోలింగ్ కేంద్రాలు
- 2025 ఫిబ్రవరి.. లేదా మార్చిలో ఎమ్మెల్సీ ఎన్నికలు?

సాక్షిప్రతినిధి, వరంగల్ :

వరంగల్–నల్లగొండ–ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.ప్రావీణ్య విడుదల చేశారు. మొత్తం 24,905 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవీ కాలం 2025 మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించేందుకు పాత ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 30న రద్దు చేసింది. ఉపాధ్యాయులు తిరిగి తమ ఓటు హక్కును అక్టోబర్ 1 నుంచి నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్ పద్ధతుల్లో ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మూడు నెలలుగా సాగిన ప్రక్రియ అనంతరం 24,905 మంది అర్హత గల ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. కాగా ఎన్నికల సంఘం, ఏర్పాట్ల స్పీడును బట్టి వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఉపాధ్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

2019తో పోలిస్తే పెరిగిన ఓటర్లు...

2019 మార్చిలో జరిగిన వరంగల్ – నల్లగొండ – ఖమ్మం శాసన మండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో మొత్తం 20,888 మంది ఓటర్లున్నారు. ఇందుకోసం 181 పోలింగ్ కేంద్రాలు అప్పుడు ఏర్పాటు చేశారు. 2025 మార్చిలో ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 30న పాత జాబితాను రద్దు చేసి కొత్తగా ఓటర్ల నమోదుకు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా నవంబర్ 23న ప్రకటించిన ముసాయిదా జాబితా నాటికి 22,554 మంది ఓటర్లు నమోదయ్యారు. ఆ తర్వాత కూడా ఓటర్ల నమోదుకు దరఖాస్తుల గడువు పెంచగా.. డిసెంబర్ 30 (సోమవారం) నాటికి 24,905 మంది ఓటర్లుగా నమోదైనట్లు ఎన్నికల సంఘం తుది జాబితా ప్రకటించింది. ముసాయిదా జాబితాకు ఫైనల్ జాబితాకు 2,351 మంది ఓటర్లు పెరగగా.. 2019 ఓటర్ల జాబితాతో పోలిస్తే 4,017 మంది ఉపాధ్యాయుల ఓట్లు పెరిగాయి.

పురుష ఓటర్లే ఎక్కువ...

ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మంలకు చెందిన 12 జిల్లాల్లో నమోదైన మొత్తం 24,905 మంది ఉపాధ్యాయ ఓటర్లలో అత్యధికంగా పురుషులే ఉన్నారు. 9,965 మంది స్త్రీ ఓటర్లు నమోదు కాగా, పురుషులు 14,940 మంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఈ సారి 12 జిల్లాల్లోని 191 మండలాల్లో 200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి వరంగల్‌లోని ఓటర్లు 10,797...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 24,905 మంది ఓటర్లలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఆరు జిల్లాల నుంచి 6,509 మంది పురుషులు, 4,288 స్త్రీల ఓటర్లు కలిపి మొత్తం10,979 మంది ఉన్నారు. అత్యధికంగా హనుమకొండ జిల్లాలో 5,098 మంది ఓటర్లు నమోదు కాగా, తర్వాత వరంగల్‌లో 2,225, మహబూబాబాద్‌లో 1,618, జనగామలో 921, ములుగులో 61 2, జేఎస్ భూపాలపల్లిలో 323 మంది ఉపాధ్యాయ ఓటర్లున్నారు.

జిల్లాల వారీగా మండలాలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

జిల్లా	మండలాలు	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	మొత్తం
సిద్దిపేట	04	04	120	43	163
జనగామ	12	12	556	365	921
హనుమకొండ	11	15	2,884	2,214	5,098
వరంగల్	13	13	1,381	844	2,225
మహబూబాబాద్	18	16	1,083	535	1,618
భూపాలపల్లి	07	07	211	11	323
ములుగు	09	09	394	218	612
భద్రాద్రి	23	23	1,038	941	1,949
ఖమ్మం	21	24	2,300	1,655	3,955
యాదాద్రి	17	17	595	326	921
సూర్యాపేట	23	23	1,690	947	2,637
నల్లగొండ	33	37	2,688	1,795	4,483

పురుష ఓటర్లు 14,940

స్త్రీ ఓటర్లు 9,965

మొత్తం ఓటర్లు 24,905



జిల్లాలు 12

మండలాలు 191

ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లు 200

చర్చా.. రచ్చా?

నేడు గ్రేటర్ వరంగల్ కౌన్సిల్ సమావేశం

- ఎండగట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు రెఢీ
- ఎదుర్కొనేందుకు సిద్ధమంటున్న అధికార పక్షం
- తీర్మానాలకే పరిమితమవుతున్న సర్వసభ్య సమావేశాలు

వరంగల్ అర్బన్: నగరంలో పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం అటకెక్కింది. వివిధ విభాగాల పనితీరు అధ్వానంగా తయారైంది. కార్పొరేటర్లు, అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు ఎదురవుతున్నాయి. కొంత మంది ప్రతిపక్ష, అధికార పక్ష కార్పొరేటర్లు తమ ఉనికిని చాటుకోవడానికి సర్వసభ్య సమావేశంలో హడావిడి చేస్తున్నారే తప్ప వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయట్లేదు. మంగళవారం ఉదయం 11:30 గంటలకు మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ హాల్లో సర్వసభ్య సమావేశం జరగనుంది. 15 అంశాలతో కూడిన అజెండాను సిద్ధం చేశారు. మాస్టర్ ప్లాన్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు 'అలైన్ మెంట్' మార్పు, అజాంజాహి మిల్లు కార్మికుల యూనియన్ భవనం స్థానంలో ఓ వ్యాపారికి అడ్డగోలుగా కమర్షియల్ కాంప్లెక్స్‌కు అనుమతి, కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంలో జాప్యం, అధికార పక్షం తీరుపై నిరసన వ్యక్తం చేయాలని బీఆర్ఎస్, బీజేపీలు నిర్ణయించుకున్నాయి. మరోవైపు అధికార పార్టీలో అసంతృప్తులు బయట పడకుండా ముందస్తుగా చర్చలు జరిగాయి.

నిధులున్నా.. పనులేవి?

ఇటీవల గ్రేటర్ అభివృద్ధికి నిధుల వరద పారింది. ఆనిధులు ఖర్చయ్యే మార్గం కానరాక డివిజన్లలో అభివృద్ధి నిలిచింది. ఇంజినీర్ల నిర్లక్ష్యం అడుగడునా కనిపిస్తోంది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ మరో మూడు నెలలు గడిస్తే ముగియనుంది. 15వ ఆర్థిక సంఘం, స్వచ్ఛ భారత్ నిధులు సకాలంలో వినియోగించుకోలేకపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి నిధులు ఖర్చు చేయలేకపోయారు. వివిధ పథకాల్లో చేపట్టిన 30శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చాలా మేరకు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. జనరల్ ఫండ్, ఎస్‌సీ తదితర నిధులతో చేపట్టే పనులు నత్తనడకన సాగుతున్నాయి. సమస్యలపై నగర ప్రజలు గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ పరిష్కారం దొరకట్లేదు.

సమస్యలెన్నో..

నగరంలో చాలా కాలనీల్లో మౌలికవసతులు లేవు. ఇప్పటికీ తాగునీరందడం లేదు. వ్యక్తిగత మరుగుదొడ్లు.. వేల సంఖ్యలో ఇళ్లకు సెప్టిక్ ట్యాంకుల్లేవు. పారిశుద్ధ్య కార్మికుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. వ్యాధులు వ్యాపిస్తున్నాయి. కుక్కలు, కోతుల సంచారం పెరిగిపోయింది.

మితిమీరిన అవినీతి

ఈ–ఆఫీస్ ద్వారా ఫైళ్లు కదలడం లేదు. ఏ పని కావాలన్నా చేయి తడపాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. పన్నుల విభాగం, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రజారోగ్యం విభాగాల్లో అవినీతి మితిమీరిపోయింది. వీటన్నింటిపై కౌన్సిల్ సమావేశంలో చర్చ జరగాల్సి ఉంది.



మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్, పక్కన మాజీ ఎమ్మెల్యే నరేందర్

ప్రజా సమస్యలపై గళమెత్తాలి

దాస్యం వినయ్‌భాస్కర్

హన్మకొండ : గ్రేటర్ కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై గళమెత్తాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్.. ఆ పార్టీ కార్పొరేటర్లకు సూచించారు. ఆదివారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్పొరేటర్లతో వారు సమావేశమై కౌన్సిల్‌లో వ్యవహరించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నిలదీయాలన్నారు. డివిజన్ల అభివృద్ధికి కావాల్సిన నిధుల కోసం కొట్లాడాలని సూచించారు. నగర ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతున్న తీరును ఎండగట్టాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రవి నాయక్, రాజు నాయక్, రాధిక రెడ్డి, అశోక్ యాదవ్, నర్సింగ్, మధు, రంజిత్ రావు, లోహిత రాజు, మరుపల్లి రవి పాల్గొన్నారు.

ఎగుమతులు పెంచేందుకు చర్యలు

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: జిల్లా నుంచి ఎగుమతులు పెంచేందుకు అవసరమైన అన్ని వసతులు అందించేదుకు యంత్రాంగం కట్టుబడి ఉందని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎగుమతులు చేసే ఉత్పత్తుల పరిమాణం, వివరాలను ఆయా అసోసియేషన్ల సహకారంతో సేకరించి, ఉప సంఘాల్లో చర్చించి, నివేదిక రూపంలో సమర్పించాలని సూచించారు. జిల్లా నుంచి బియ్యం, గ్రానైట్, మిరపకాయలు, టెక్స్‌టైల్ ఉత్పత్తులు పెద్ద సంఖ్యలో ఎగుమతి అవుతున్నాయని, ఇంకా అవకాశమున్న ఇతర ఉత్పత్తుల వివరాలను గుర్తించి నివేదికలో చేర్చాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, డీజీఎఫ్‌టీ ఉప సంచాలకులు శైలజ, ఎల్‌డీఎం శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రధర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

పథకాల లక్ష్యాలు చేరుకోవాలి..

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లక్ష్యాలను ఆర్థిక సంవత్సరం 2024–25 ముగింపు వరకు పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్, చేయూత పింఛన్లు, తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.

స్వచ్ఛ ఆటోలతో ఓనర్ కమ్ డ్రైవర్ల ధర్నా

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం స్వచ్ఛ ఆటోలతో ఓనర్ కమ్ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. నగరంలో ఎనిమిదేళ్లుగా తడి, పొడి చెత్తను సేకరించి తరలిస్తున్నా.. ఈఎస్ఐ, పీఎఫ్, కనీసం ఐడీ కార్డులు కూడా లేవని ఆందోళన చేపట్టారు. తమ వాహనాలను బల్దియాలో విలీనం చేసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని నినదించారు. ఈసందర్భంగా స్థానిక మట్టెవాడ పోలీసులు ఆటోలను బల్దియా కార్యాలయం నుంచి తరలించాలని సూచనలు చేశారు. దీంతో పోలీసులకు, డ్రైవర్ కమ్ ఓనర్లకు మధ్య కొద్ది సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. బల్దియా 250 కొత్త స్వచ్ఛ ఆటోలు, 30 ట్రాక్టర్లు కొనుగోలు చేసి తమకు అన్యాయం చేయాలని పాలకవర్గం పెద్దలు, ఉన్నతాధికారులు కుట్రలు చేస్తున్నట్లు కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేయకుండా తమ పొట్టకొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



ధర్నా చేస్తున్న స్వచ్ఛ ఆటోల ఓనర్ కమ్ డ్రైవర్లు

చరిత్రకు సాక్ష్యం.. కలెక్టర్ బంగ్లా

హెరిటేజ్ భవనంగా మార్పు

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య నిర్ణయం.. ఉత్తర్వులు
- 1886లో బ్రిటీష్ హయాంలో భవన నిర్మాణం
- 138 సంవత్సరాల చారిత్రక గుర్తింపు
- ఇందులో 57మంది కలెక్టర్ల విడిది
- నగరానికి ఐకాన్‌గా మార్చేందుకు అడుగులు





హెరిటేజ్ భవనంగా మారనున్న కలెక్టర్ బంగ్లా ఇదే..

హన్మకొండ అర్బన్: నిజాం కాలంలో, అప్పటి పాలకుడు సుబేదార్ నివాసం కోసం 1886లో జార్జ్ పామర్ సారథ్యంలో నిర్మించిన ప్రస్తుత హనుమకొండ కలెక్టర్ బంగ్లా చరిత్రకు సాక్ష్యంగా నిలవబోతున్నది. సుమారు 138 సంవత్సరాల ఈ పురాతన ఈ భవనాన్ని, చారిత్రక వారసత్వంగా (హెరిటేజ్ భవనంగా) అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. కలెక్టర్ ప్రావీణ్య ఇటీవల నూతనంగా నిర్మించిన నివాసంలోకి గృహప్రవేశం చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

చారిత్రక నిర్ణయం

కలెక్టర్ ప్రావీణ్య కొత్తగా నిర్మించిన నివాస భవనంలోకి మారిన సందర్భంలో పాత భవనాన్ని చరిత్రకు గుర్తుగా నిలిపి ఉంచాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసి, ఈ భవనాన్ని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి (కుడా) అప్పగించారు. ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసి, సందర్శకులకు ఆకర్షణీయ కేంద్రంగా మార్చాలని ఆదేశించారు.

అభివృద్ధి ప్రణాళికలు

ఈ భవనాన్ని కాఫీ డే తరహాలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలతోపాటు, ప్రజల ఆకర్షణగా సందర్శనీయ ప్రాంతంగా ఉండేందుకు ఇతర రూపకల్పనలపై కూడా చర్చలు జరుగుతున్నాయి. పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్ హాల్, సెంట్రల్ లైబ్రరీల మాదిరిగా విద్యార్థులు, ప్రజలు సందర్శించేలా తీర్చిదిద్దాలని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే పేరున్న కొన్ని ఏజెన్సీలు భవనాన్ని పరిశీలించి, అభివృద్ధి ప్రతిపాదనలు సమర్పించాయి.

చరిత్రను గుర్తు చేసుకుంటూ..

సుమారు 15 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్రాంగణంలో, నివాస భవనం, పరిపాలనా భవనం, పెద్ద బావి వంటి కట్టడాలు ఉన్నాయి. నిజాం కాలంలో ఇక్కడ కూరగాయలు పండించేవారని చెబుతారు. ఉమ్మడి జిల్లాలున్న కాలంలో 52 మంది ఐఏఎస్ అధికారులు ఇందులో నివాసముండగా, విభజన అనంతరం ఐదుగురు కలెక్టర్లు వినియోగించారు.

రహస్యాలు.. గాథలు

ఒకానొక దశలో, ఈ భవనంలో దయ్యాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఆమ్రపాలి కాటా కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఈ వార్తలు సంచలనం సృష్టించాయి. స్వయంగా అప్పటి కలెక్టర్ ఆమ్రపాలి తన దయ్యం అనుభవాలు వెల్లడించడం ఆసక్తిగా మారింది. కానీ, దీనికి ఎలాంటి ఆధారాలూ లభించలేదు.

నగర ఐకాన్‌గా కలెక్టర్ బంగ్లా

ఈ భవనం చారిత్రక వారసత్వానికి నిలువెత్తు సాక్ష్యం. దానిముందు భాగంలో పెద్ద గడియారం, ప్రధాన రహదారిపై కూడలి వద్ద భవనం ఉండడం వల్ల చారిత్రక గుర్తింపుగా ఉంటూ వస్తోంది. దాన్ని కాపాడడంతోపాటు మరిన్ని ఆకర్షణీయమైన విధానాలతో అభివృద్ధి చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఇది నగరానికి ఒక చారిత్రక కీర్తిపతాకంగా నిలిచే అవకాశం ఉంది.

మేం.. రెవెన్యూ శాఖలోకి వస్తాం!
206 మంది ఆన్‌లైన్‌లో అర్జీలు ● వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

8లో

బీఆర్ఎస్, కాంగ్రెస్ నయవంచన
బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

ఆలయ పునర్నిర్మాణానికి ప్లేట్ లోడ్ టెస్ట్



వెంకటాపురం(ఎం): రామప్ప ఆలయ పరిధిలోని కామేశ్వరాలయ పునర్నిర్మాణానికి కేంద్ర పురావస్తుశాఖ అధికారులు సోమవారం ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించారు. కామేశ్వరాలయ నిర్మాణ ప్రదేశం.. శిల్పాల బరువును ఎంతమేర తట్టుకుని నిలబడుతుందో తెలుసుకోవడానికి ప్లేట్ లోడ్ టెస్ట్ నిర్వహించామని కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ అజ్మీరా భీమా, డిప్యూటీ సూపరింటెండెంట్ చంద్రకాంత్, హెచ్‌ఆర్ దేశాయి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ నవీన్‌కుమార్ తెలిపారు. 20 నుంచి 100 టన్నుల వరకు ఐదు దశల్లో (ఇసుకతో కూడిన సంచులు) బరువు వేసి టెస్ట్ చేసినట్లు వారు వెల్లడించారు.

ముగిసిన నాటక ఉత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజులు నిర్వహించిన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక రాష్ట్ర స్థాయి నాటక పోటీలు సోమవారం ముగిశాయి. చివరి రోజు 'మహారాణి రుద్రమ్మదేవి చారిత్రాత్మక పద్యనాటకం' ఆకట్టుకుంది. కాకతీయ నాటక పరిషత్ అధ్యక్షుడు రాజారపు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో తడకమళ్ల రాంచందర్‌రావు రచనలో దేవరాజు రవీందర్‌రావు దర్శకత్వంలో ఈనాటకం ప్రదర్శించారు. ఈ నాటకానికి సురభి కొండల్‌రావు సంగీతం అందించారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ శేఖర్‌బాబు భౌతికంగా లేకపోయినా ఆయన ప్రదర్శించిన నాటకాలు, కళానైపుణ్యం సంజీవంగా ఉన్నాయన్నారు. కాగా, అటికం రాజమ్మ–ఎల్లగౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాకారులకు నాలుగు రోజులు భోజన సౌకర్యం కల్పించారు. కళాకారుడు లక్ష్మీకాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, జిల్లా అధ్యక్షుడు ఓడపల్లి చక్రపాణి, బాలాజీరావు, మోత్కుర్ మనోహర్‌రావు, శ్యాంప్రసాద్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అటికం రవీందర్‌గౌడ్, కళాకారులు మాడిశెట్టి రమేశ్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేయూ భూముల సర్వే

● పలుచోట్ల మార్కింగ్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వివిధ సర్వే నంబర్లలోని భూముల్లో సోమవారం సర్వే నిర్వహించారు. పలివేల్పులవైపు ఉన్న 373, 414 సర్వే నంబర్లలో సర్వే నిర్వహించారు. పలు చోట్ల మార్కింగ్‌ను కూడా చేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ పవన్, సర్వేయర్ రాజేశ్ సర్వే చేస్తున్నారు. ఈనెల 28న లష్కర్‌సింగారం కుమార్‌పల్లి 38 సర్వేనంబర్ భూమిలో కూడా సర్వే నిర్వహించారని కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి తెలిపారు. మరో రెండు మూడు రోజులు సర్వే కొనసాగే అవకాశం ఉందని సమాచారం. ఈ కార్యక్రమం పూర్తయి యూనివర్సిటీ భూములకు మార్కింగ్ పూర్తయితే క్యాంపస్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఆగిన పాఠాలు..

కాంట్రాక్ట్ సీఆర్‌టీల ధర్నా

- రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్
- పదో తరగతి సిలబస్ పూర్తి కాక విద్యార్థులు ఇబ్బందులు
- సమ్మెతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం



ములుగు జిల్లాలో ధర్నా చేస్తున్న సీఆర్‌టీలు (ఫైల్)

మహబూబాబాద్ అర్బన్ : గిరిజన ఆశ్రమ పాఠశాలలో పాఠాలు జరగడం లేదు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ) తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఐటీడీఏ పరిధుల్లో ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఫలితంగా సిలబస్ పూర్తి కాక పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్నా తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే ఉద్యోగ భద్రత కోసం పోరాటం తప్ప మరో మార్గం లేదని భావించి సమ్మె చేస్తున్నామని సీఆర్‌టీలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. కాగా, సీఆర్‌టీల సమ్మె ప్రభావం రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలపై పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	సీఆర్‌టీల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ములుగు	37	55	7070
మానుకోట	25	109	6810
జనగామ	07	20	1151
వరంగల్	07	24 మంది	1278
హనుమకొండ	07	16	851
భూపాలపల్లి	11	47	1657

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 1,500 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉన్నారు.

డిమాండ్లు ఇవే..

- కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లకు మినిమమం టైంస్కేల్, ఉద్యోగ భద్రత కల్పించాలి.
- సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి.
- ప్రతి నెల 1న గ్రీన్‌చానల్ ద్వారా జీతాలు చెల్లించాలి.
- మహిళా టీచర్లకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు వర్తింపజేయాలి.
- ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- పీఎఫ్ సౌకర్యం అందించాలి.
- 61 సంవత్సరాలు నిండిన సీఆర్‌టీలకు రూ. 20 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలి.
- సీఆర్‌టీలందరికీ హెల్త్‌కార్డు సౌకర్యం అందించాలి.
- మహిళా సీఆర్‌టీలకు చైల్డ్‌కేర్ సెలవులు మంజూరు చేయాలి

విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం..



టీచర్లు రాకపోవడంతో చదువుకుంటున్న విద్యార్థులు

ఆశ్రమ పాఠశాలో ఎస్జీటీలు 5వ తరగతి వరకు పాఠాలు బోధిస్తారు. 6 నుంచి 10వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్లు స్థానంలో ఉన్న సీఆర్‌టీలు బోధిస్తారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రత్యేక సమయం కేటాయించి విద్యార్థులను సన్నద్ధం చేయాల్సి ఉంది. ఈ క్రమంలో సీఆర్‌టీల ధర్నాతో పదో తరగతిలో ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, తెలుగు సబ్జెక్ట్‌లో పూర్తి స్థాయిలో సిలబస్ కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌జీటీలు పాఠాలు చెప్పినా అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇలాంటి కీలక సమయంలో సీఆర్‌టీల సమ్మెతో విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీచర్లు రాకపోతే ఎలా చదవాలి?



ఇప్పటి వరకు ఫిజిక్స్, మ్యాథ్స్, సబ్జెక్ట్‌లు పూర్తి కాలేదు. టీచర్లు రాకపోవడంతో పదో తరగతి వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి. సందేహాలు ఎవరు తీర్చాలి. ఫెయిలైతే ఎవరు బాధ్యులవుతారు.

– బి.శాలిని, పదోతరగతి, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, మానుకోట

సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి



20 సంవత్సరాల నుంచి రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విద్యార్థులకు బోధన చేపడుతున్నాం. 2005కు ముందు పదో తరగతిలో 10 శాతం ఉత్తీర్ణత ఉండగా, ఆ తర్వాత మాతోనే గిరిజన ఆశ్రమ పాఠశాలలో 95 శాతం పెరిగింది. ప్రభుత్వం మా సమస్యలు పరిష్కరించి సర్వీస్ క్రమబద్ధీకరించాలి.

– గుగులోత్ చిట్టిబాబు, సీఆర్‌టీ, పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానుకోట జిల్లా

ప్రతీ నెల 1వ తేదీన వేతనం చెల్లించాలి



రాష్ట్రవాప్తంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో బోధిస్తున్న సీఆర్‌టీలకు ప్రతి నెల వేతనాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. ప్రభుత్వం మాకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలి. మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి.

– లకావత్ రాములు సీఆర్‌టీ, జనగామ జిల్లా

రెగ్యులర్ ఉపాధ్యాయులతో బోధిస్తున్నాం



ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లతో పదో తరగతి విద్యార్థులకు పూర్తికాని సబ్జెక్ట్‌లను బోధిస్తున్నాం. ఎక్కడా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– గుగులోత్ దేశీరాం, ఏటీడీఓ ములుగు, మానుకోట జిల్లాల ఇన్‌చార్జ్

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నయవంచన

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్
- వరంగల్‌లో బస్ స్టేషన్ నిర్మించాలని ధర్నా



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నయవంచన చేస్తే, ప్రస్తుత తూర్పు ఎమ్మెల్యే, మంత్రి అసమర్థత కారణంగా వరంగల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణానికి నోచుకోవట్లేదని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ విమర్శించారు. సోమవారం వరంగల్ ఆత్మగౌరవ పోరాటంలో భాగంగా.. ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణ స్థలంలో ఆయన ధర్నా చేశారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర రెండో రాజధానిగా వరంగల్‌ను తీర్చిదిద్దుతామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సర్కారు.. కనీసం వరంగల్ బస్టాండ్ నిర్మాణ పనుల్ని చేపట్టడం లేదంటూ మండిపడ్డారు. ఎన్నికల ముందు అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కోట్ల రూపాయలతో కొత్త బస్టాండ్ నిర్మిస్తామంటూ ఉన్న దాన్ని కూల్చాడని మండిపడ్డారు. ఆతర్వాత కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హృదయ్, అమృత్, స్మార్ట్ సిటీ వంటి ఎన్నో పథకాలకు భారీగా నిధులు కేటాయించి వరంగల్‌ను ప్రగతిదారిలో నడిపిస్తుంటే.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఓరుగల్లు చరిత్రను భ్రష్టు పట్టిస్తున్నాయని విమర్శించారు. ఈధర్నాలో మాజీ మేయర్ టి.రాజేశ్వరరావు, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాంనాయక్, మాజీ శాసనసభ్యులు అరూరి రమేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, రత్నం సతీశ్ షా, గురుమూర్తి శివ, వన్నాల వెంకటరమణ, నాయకులు వంగాల సమ్మిరెడ్డి, బాకం హరిశంకర్, రాణా ప్రతాప్‌రెడ్డి, సముద్రాల పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి

- తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి



మాట్లాడుతున్న దామోదర్ రెడ్డి

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని సంఘం కార్యాలయంలో పెన్షనర్స్‌డే జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతోందని విమర్శించారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలువేరుచంద్రశేఖర్, ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, ఏటీఓలు శ్రీనివాస్ రెడ్డి, అన్వర్ హుస్సేన్, సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు కందుల సంజీవ రెడ్డి, ఎండీ నిజాముద్దీన్, సాంబయ్య, లక్ష్మయ్య, బాలరాజు. మల్లారెడ్డి, ఎం.జనార్దన్, ఆగయ్య, జి.రవీందర్ పాల్గొన్నారు.

మనస్తాపంతో డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

- నందనాయక్‌తండా ఎస్టీ కాలనీలో ఘటన



విష్ణు(ఫైల్)

గీసుకొండ: వరంగల్ జిల్లా గీసుకొండ మండలం నందనాయక్ తండా ఎస్టీ కాలనీకి చెందిన డిగ్రీ విద్యార్థి బాదావత్ విష్ణు(22) మనస్తాపంతో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడాడ్డు. పోలీసుల కథనం ప్రకారం.. నందనాయక్‌తండా ఎస్టీ కాలనీకి చెందిన విష్ణు హనుమకొండ వాగ్దేవి డిగ్రీ కళాశాలలో బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. కొన్ని నెలల క్రితం ఫైనాన్స్‌లో బైక్ కొనుగోలు చేశాడు. బైక్ ఎక్కడిదని తల్లిదండ్రులు అడిగితే హైదరాబాద్‌లో జాబ్ చేస్తున్నానని, ఫైనాన్స్‌లో తీసుకున్నానని చెప్పాడు. అలాగే, అతడు జూన్‌లో తన బైక్‌తో యాక్సిడెంట్ చేశాడని తల్లిదండ్రులకు తెలిసింది. క్రిస్మస్ రోజు ఇంటికి వచ్చి మరుసటి రోజు 26వ తేదీన కుటుంబీకులకు చెప్పి కాలేజీకి వెళ్లాడు. ఈ క్రమంలో సోమవారం మృతుడి తల్లిదండ్రులు నర్సింహ, కవిత తమ వ్యవసాయ బావివద్దకు వెళ్లారు. అక్కడ బైక్, చెప్పులు, సెల్‌ఫోన్ ఉండడంతో అనుమానం వచ్చి తన కుమారుడు బావిలోకి దూకి ఉంటాడని భావించి 100కు డయల్ చేశారు. గ్రామస్తులు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడి మృతదేహాన్ని వెలికితీశారు. తన కుమారుడు ఫైనాన్స్‌లో బైక్‌ను తీసుకుని కొనుగోలు చేయడంతో పాటు హైదరాబాద్‌లో చేసిన యాక్సిడెంట్ విషయంలో మనస్తాపం చెంది బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా



కాశీబుగ్గ సెంటర్: పైడిపల్లి శివారులోని స్టాలిన్‌నగర్ ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో గుడిసె వాసులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు ఇళ్ల మంజూరుకోసం జాబితాను అందజేశారు. ప్రసంగి, రవి, మొగిలి, సదయ్య, శంకరాచారి, ఇస్తారి, ప్రేమలత, మాలతి, జ్యోతి, జూబేదా పాల్గొన్నారు.

వినతులు త్వరితగతిన పరిష్కరించండి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో స్వీకరించిన వినతుల్ని త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 140 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వైవీ గణేశ్, ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, డీఆర్డీఓ మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి...

నగరంలోని స్నేహనగర్ కాలనీలో పర్యావరణ సమస్యలు అధికమవుతున్న నేపథ్యంలో అధికారులు శ్రద్ధ తీసుకోవాలని, మౌలిక వసతులు కల్పించాలని స్నేహనగర్ కాలనీ డెవలప్‌మెంట్ సేవా సొసైటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు.

కొలువుల ఏడాది..

- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నాలుగు వేల వరకు ఉద్యోగాలు
- పోలీసు విభాగంలోనే అత్యధికంగా నియామకాలు
- ఆ తర్వాతి స్థానంలో టీచర్లు, గ్రూప్–4 జాబ్స్



సాక్షి, వరంగల్: ఈ ఏడాది యువతలో ఉద్యోగానందం కనిపించింది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా దాదాపు 4వేల మంది సర్కారు కొలువులకు ఎంపికయ్యారు. వైద్య, పోలీసు, గ్రూప్ –4 విభాగాలతోపాటు వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. జూన్ 9న గ్రూప్–4, అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్ –1 మెయిన్స్ నిర్వహించారు. డిసెంబర్ 15న నిర్వహించిన గ్రూప్–2 పరీక్షకు 63,872 మంది హాజరయ్యారు. గ్రూప్–3 సహా అన్ని రకాల పోటీ పరీక్షలను లక్ష మందికి పైగా రాశారు. ఇందులో చాలా మంది ప్రభుత్వ కొలువులు సాధించారు. డీఎస్సీ ద్వారా వందలాదిమందికి అక్టోబర్ 15న ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చారు. గురుకులాలు, ఆదర్శపాఠశాలల్లో 400 మంది ఉద్యోగాలు సాధించారు. వైద్యారోగ్య విభాగంతో పాటు మెడికల్ కాలేజీల్లోనూ దాదాపు 500పైగా ఉద్యోగులను నియమించారు.

పోలీసు శాఖలోనే ఎక్కువ నియామకాలు..

తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2022 మార్చిలో నోటిఫికేషన్ ఇస్తే ఆగస్టులో ప్రిలిమ్స్, డిసెంబర్‌లో ఈవెంట్స్, 2023 ఏప్రిల్ 30న మెయిన్స్ జరిగింది. 2024 ఫిబ్రవరిలో అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వడంతో ఫిబ్రవరి 20న శిక్షణ ప్రారంభమైంది. నవంబర్ 20న ఏఆర్ కానిస్టేబుళ్ల శిక్షణ ముగిసి విధుల్లో చేరారు. బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్ల శిక్షణ వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగియనుంది. ఇలా దాదాపు రెండేళ్లకు పైగా ఎదురుచూసిన వేలాది మంది అభ్యర్థులకు ఈ ఏడాది నియామక పత్రాలు చేతికందడంతో సంబురపడిపోయారు. ఇలా వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలను కలుపుకుని ఉన్న వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 900 మంది పోలీసు కానిస్టేబుళ్లు, 36 మంది ఎస్సైలు చేరారు. అలాగే, మహబూబాబాద్ జిల్లాలో 151, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 123, ములుగు జిల్లాలో 63 మంది పోలీసు సిబ్బంది విధుల్లో చేరారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గ్రూప్–4లో 825 మంది ఉద్యోగాలు పొందారు. వైద్యవిభాగంతో పాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో 700 మంది వరకు నియామకాలు జరిగాయి.

టీచర్లకు 'మెగా' సంతోషమే..

తెలంగాణలో మెగా డీఎస్సీకి ఫిబ్రవరి 29న ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 11,062 పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్లు, భాషాపండితులు, పీఈటీలు, ఎస్జీటీలు, ప్రత్యేక కేటగిరీలో స్కూల్ అసిస్టెంట్‌లు, ఎస్జీటీ పోస్టులున్నాయి. 2023 సెప్టెంబర్ 6న 5,089 పోస్టులతో జారీ చేసిన ప్రకటనను రద్దు చేసిన అనంతరం ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇలా ఏళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల కోసం వేచిచూస్తున్న వారికి ఈ ఏడాది ఇచ్చిన నోటిఫికేషన్ వరమైంది. జూలై 18 నుంచి ఆగస్టు 5వ తేదీవరకు 26 సెషన్లలో కంప్యూటర్ బేస్ట్ టెస్ట్ (సీబీటీ) పరీక్షలు నిర్వహించారు. సెప్టెంబర్ 30న ఫలితాలు విడుదల చేశారు. ఇలా వరంగల్ జిల్లాలో 272 మంది, హనుమకొండలో 169, జయశంకర్ భూపాలపల్లిలో 235, ములుగులో 176, మహబూబాబాద్ జిల్లాలో 361 మంది టీచర్లకు పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో కొందరు టీచర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకుని ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

క్రీడాభివృద్ధిపై హెచ్‌సీఏకు శ్రద్ధ లేదు

- 'టి' క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి విజయ్‌చందర్‌రెడ్డి
- 8 నుంచి గోల్డ్ ప్రీమియర్ కప్ క్రికెట్ పోటీలు



మాట్లాడుతున్న పెసరు విజయ్‌చందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు నిధులపై ఉన్న శ్రద్ధ క్రీడాభివృద్ధిపై లేదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని టీసీఏ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 8 నుంచి 18వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో తెలంగాణ గోల్డ్ ప్రీమియర్ క్రికెట్ కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ పోటీల్లో పాల్గొనే జట్టు ప్రవేశ రుసుం రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విజేతకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేల నగదు పారితోషికం అందజేస్తామన్నారు. టీసీఏ జిల్లా జనరల్ సెక్రటరీ తాళ్లపెల్లి జయపాల్ మాట్లాడుతూ పది రోజులు జరిగే మ్యాచ్‌లు హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానం, వరంగల్ శివారు మొగిలిచర్లలో జరుగుతాయని తెలిపారు. ఇందులో నుంచి ఉత్తమ జట్లను ఎంపిక చేసి జనవరి 26 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌సీఏ కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాగా టీసీఏ హైదరాబాద్ మినహా అన్ని జిల్లాల్లో టోర్నమెంట్లు నిర్వహిస్తోందన్నారు. జట్ల రిజిస్ట్రేషన్ కోసం 9581124444, 9700664444 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. టీజీఏ జాయింట్ సెక్రటరీ మహ్మద్ అలీం, ఎం. సమీఅక్మల్ పాల్గొన్నారు.

మేం.. రెవెన్యూ శాఖలోకి వస్తాం!

- 206 మంది ఆన్‌లైన్‌లో అర్జీలు
- వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

హన్మకొండ అర్బన్: రెవెన్యూ శాఖలోకి వచ్చేందుకు తాము ఆసక్తిగా ఉన్నామంటూ వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం వీరి దరఖాస్తులను జిల్లా అధికారులు పరిశీలిస్తున్నారు. జిల్లాలో మొత్తం 206 మంది మాతృశాఖ రెవెన్యూకు రావడానికి ఆసక్తి కనబర్చారు. కాగా.. గత ప్రభుత్వం 2018లో వీఆర్‌ఓల వ్యవస్థను రద్దు చేసింది. వీర్‌ఓల వల్లనే రెవెన్యూ వ్యవస్థ నాశనం అయ్యిందని ఆరోపిస్తూ వారిని వివిధ ప్రభుత్వ శాఖల్లోకి బలవంతంగా పంపించారు. ఆతర్వాత గ్రామస్థాయిలో వీఆర్‌ఏల వ్యవస్థను కూడా పూర్తిగా రద్దు చేసిన ప్రభుత్వం వారిని కూడా ఇతర శాఖలకు పంపించింది. వీరిలో కొందరు సుదూర ప్రాంతాలకు బదిలీ అయినవారున్నారు. ఇప్పటికీ వారంతా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం ధరణి స్థానంలో కొత్త వ్యవస్థను తీసుకొస్తోంది. దీంతో గ్రామస్థాయిలో రెవెన్యూ సిబ్బంది అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం జూనియర్ రెవెన్యూ అధికారులను నియమించాలని నిర్ణయించింది. అయితే కొత్త వారితో కాకుండా.. గతంలో రెవెన్యూ శాఖలో పని చేసి ఇతర శాఖలకు వెళ్లిన వారిలో ఎవరైనా సొంత శాఖకు వచ్చి పని చేసేందుకు ఆసక్తి ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

ఆన్‌లైన్ దరఖాస్తులు..


ప్రభుత్వం ఆసక్తి ఉన్నవారిని ఆన్‌లైన్ ద్వారా గూగుల్ షీట్‌లో వివరాలు పూర్తి చేసి సంబంధిత పత్రాలు, ఇతర వివరాలు అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఈనెల 24 నుంచి 28 వరకు ఈప్రక్రియ సాగింది. ప్రస్తుతం వారి దరఖాస్తుల్ని జిల్లా అధికారులు పరిశీలిస్తున్నారు. లోపాలు ఉన్నట్లెతై సవరించి ప్రభుత్వానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

206 మంది దరఖాస్తు..

గతంలో జిల్లా నుంచి వీఆర్‌ఓలు 138 మంది, వీఆర్‌ఏలు 308 మంది పదోన్నతులు, వ్యవస్థ రద్దు కారణంగా ఇతర శాఖల్లో సర్దుబాటు చేశారు. ప్రస్తుతం వారిలో 206 మంది తాము మాతృశాఖకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నట్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎక్కువమంది ఇరిగేషన్ శాఖకు లష్కర్లు, హెల్పర్లుగా వెళ్లినవారు ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటర్ విద్యార్హత కలిగిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా నుంచి వెళ్లిన జాబితాపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- ప్రజావాణిలో 122 దరఖాస్తులు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కాశీబుగ్గ సెంటర్: ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 122 వినతులు రాగా ఆయా శాఖల అధికారులకు సిఫార్సు చేశారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఇబ్బందులు లేకుండా ఇప్పటి వరకు సేకరించిన ఇందిరమ్మ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. డీఆర్‌డీఓ ఎం. విజయలక్ష్మి, డీఆర్‌డీఓ పీడీ కౌసల్యదేవి, జెడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుగా మార్చుతున్నాం..

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ట్రాక్టర్ల ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి ఎరువుగా మార్చుతున్నామని వరంగల్ కలెక్టర్ సత్యశారద తెలిపారు. సోమవారం ఢిల్లీ నుంచి ఎస్‌బీఎం జాయింట్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ పాల్గొని స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమం అమలును వివరించారు.

ప్రాన్ నంబర్లు కేటాయించాలి

కాశీబుగ్గ సెంటర్: కొత్త టీచర్లకు ప్రాన్ నంబర్లు కేటాయించి సకాలంలో జీతాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ కోరారు. డీఎస్సీ 2024లో నియమితులైన ఉపాధ్యాయులకు 45 రోజులు దాటినా.. ప్రాన్ నంబర్లను కేటాయించలేదన్నారు. ఈ విషయమై సోమవారం జిల్లా ఖజానా శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన